ప్రజాశక్తి

బుధవారం 7 ఆగస్టు 2024 5

శ్రీ సత్యసాయి

ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రితో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో భేటీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న సమావేశం అయ్యారు. అమరావతి రాష్ట్ర సచివాలయం 5వ భవనంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా వారిని కలిసి కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా పరిస్థితులను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి కలెక్టర్, ఎస్పీ వివరించారు.

అప్పుకట్టలేదని అరెస్ట్ వారెంట్..!

- 20 మంది నిరుపేదలకు వారెంట్లు
- ట్రాక్టర్ రుణం చెల్లించాలంటూ ఒత్తిడి
- వాహనాలే తమ వద్ద లేవని బాధితుల గగ్గోలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఒక కార్పొరేట్ ఫైనాన్స్ సంస్థలోని సిబ్బంది, ట్రాక్టర్ డీలరు, కొంత మంది దళారాలు కలసి అప్పుల వల విసిరారు. నిస్సాహాయులు, నిరుపేదల అమయకత్వాన్ని ఆసరగా చేసుకుని వారి పేరు మీద ట్రాక్టర్ రుణాలు మంజూరు చేశారు. ఆ వాహనాలను బయట విక్రయించి కోట్లాది రూపాయలు సొమ్మును పైముగ్గురూ కాజేశారు. కాజేసిన వారు బాగానే ఉన్నా అమాయకులపై మాత్రం అప్పుల భారం మోపారు. ఇప్పుడు ఆ అప్పులు చెల్లించాలని నిరుపేదలకు ఫైనాన్స్ సంస్థ ఒత్తిడి తెస్తోంది. నిలువ నీడలేని తాము ఇంత అప్పు ఉన్నట్టే తెలియదని గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయాన్ని కదిరి పోలీసులకు తెలియజేయడమే కాకుండా ఫిర్యాదులు గతేడాదిలోనే చేశారు. కాని ఈ కేసులో ఎటువంటి పురోగతీ జరగలేదు. ఇప్పుడు ఏకంగా తీసుకున్న అప్పులు చెల్లించమని ఫైనాన్స్ సంస్థ నుంచి పేదలకు అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. ఈ రకంగా కదిరి ప్రాంతంలో 20 మందికి అరెస్టు వారెంట్లు జారీ కావడంతో పోలీసులు వారికి సమాచారం ఇచ్చారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో బాధితులున్నారు.

పథకం ప్రకారం అప్పుల వల

ఒక పథకం ప్రకారమే పేదలపై అప్పుల వలను విసిరారు. ఏదైనా రుణం మంజూరు చేయాలంటే సవాలక్ష వివరాలు తీసుకుని, ఆయన తిరిగి చెల్లించగలిగే స్తోమత ఉందా.. లేదా..? అన్నది కూడా చూసుకుని రుణాలను మంజూరు చేస్తుంటారు. కాని ట్రాక్టర్ల ఫైనాన్స్ విషయంలో మాత్రం ఏ మాత్రం నిలువనీడలేని వారిని దళారులు మొదట గుర్తించారు. వారికి మాయమాటలు చెప్పి సంతకాలు తీసుకుని ఒక్కో ట్రాక్టర్‌కు సుమారు రూ.8 లక్షల వరకు రుణాన్ని మంజూరు చేశారు. ఆ ట్రాక్టర్‌ను వారి చేతికి కూడా అందకుండానే ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. రుణం మాత్రం నిరుపేదలపైనే పడింది. తాడిమర్రి ప్రాంతంలోనూ ఇదే రకమైన మోసం జరిగితే అక్కడి పోలీసులు మోసం చేసిన వారిని గుర్తించి కటకటాల వెనక్కు పంపించారు. కదిరి ప్రాంతంలో మాత్రం పోలీసులు కేసు నమోదుకే పరిమితమయ్యారు. మోసం చేసిన వారిని పట్టుకోకపోవడంతో అమాయకులైన నిరుపేదలకు ఇప్పుడు అరెస్టు వారెంట్లు వచ్చాయి. పోలీసులు అరెస్టు చేస్తామంటు ఇళ్ల వద్దకు వస్తుండటంతో భయపడి ఇతర ప్రాంతాలకెళ్లి దాక్కునే పరిస్థితి నెలకొంది.

ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు

ఎల్అండ్‌టి ఫైనాన్స్ సంస్థలో ట్రాక్టర్ రుణం తీసుకున్నాం. దాని డబ్బులు కట్టడం ఇబ్బందిగా ఉందంటే తిరిగి షోరూమ్‌లోనే ట్రాక్టర్‌ను అప్పగించాం. దానికి సంబంధించిన ఆధారాలూ ఉన్నాయి. అయితే షోరూమ్ వారు ట్రాక్టర్‌ను ఫైనాన్స్ సంస్థకు అప్పగించకుండా బయట అమ్మేశారు. ఈ విషయమైన గతేడాది కదిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు పట్టించుకోలేదు. తమపై మాత్రం అరెస్టు వారెంట్లు వచ్చాయి. కేసు పరిష్కరించమంటే పోలీసులు పట్టించుకోవడం లేదు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. సమస్యను ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని అనుకుంటున్నాం.

కుంచపు శేఖర్ బాధితుడు, కొలేపల్లి గ్రామం.

ఉద్యోగుల నిరసనతో ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న మున్సిపల్ కార్యాలయం

కమిషనర్ వ్యవహార శైలిపై డిఆర్ఒకు ఫిర్యాదు చేస్తున్న ఉద్యోగులు

పుట్టపర్తి మున్సిపాల్టీలో కోల్డ్‌వార్

- కమిషనర్, సిబ్బంది మధ్య వివాదం
- సామూహిక సెలవులో వెళ్తున్నట్లు మున్సిపల్ ఉద్యోగుల ప్రకటన
- అధికారుల వైరంతో నిలిచిన మున్సిపల్ సేవలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జిల్లా కేంద్రమైన పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో అధికారుల మధ్య కోల్డ్ వార్ ప్రారంభం అయ్యింది. కమిషనర్ అంజయ్య నియంతత్వ ధోరణితో వ్యవహరిస్తూ మున్సిపల్ ఉద్యోగులను వేధింపులు గురి చేస్తున్నాడని ఆరోపిస్తూ ఉద్యోగులు సామూహిక సెలవుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం ఉద్యోగులంతా సామూహిక సెలవుపై వెళ్లడంతో ఈ సమస్య తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగులు విధులకు దూరంగా ఉండడంతో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి. మున్సిపల్ కమిషనర్ అంజయ్య తమకు న్యాయబద్ధంగా రావాల్సిన ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఇంక్రిమెంట్ అడిగితే ఏం పొడుస్తున్నారని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుండా తమను అవమానాలు గురి చేస్తున్నాడని ఉద్యోగులు చెబుతున్నారు. మున్సిపల్ ఛైర్మన్‌తో జతకట్టి తమను వేధింపులు గురి చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. తరచూ మెమోల పేరుతో తమను వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది విధులకు హాజరుకాకుండా తమకు అండగా నిలవాల్సిన కమిషనర్ రక్షణ కల్పించడంలో వైఫల్యం చెందారన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెండు గ్రూపులుగా విడగొట్టి తమపై దాడులు చేయిస్తున్నారంటూ ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేమని తమను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని, లేనిపక్షంలో కలిషనర్‌ను ఇక్కడి బదిలీ చేసి పంపాలని డిమాండ్ చేస్తున్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి సమస్యలపై కలెక్టర్, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్‌కి ఇప్పటికే వినతిపత్రం అందిచామన్నారు. అటువైపు నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఏమీ చేయలేని నిస్సాహాయక స్థితిలో తాము సామూహిక సెలవుకు సిద్ధమయ్యామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు అండగా నిలవల్సిన కమిషనర్ వేధింపులు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమస్యకు ముగింపు పలకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట అన్ని ఉద్యోగ యూనియన్లను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

సమస్యలకు సకాలంలో పరిష్కారం

కలెక్టర్ టిఎస్.చేతన్

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పెండింగ్‌లో ఉన్న సమస్యలను సకాలంలో పరిష్కరించేలా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. మంగళవారం నాడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వీటిపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తహశీల్దార్లు, విఆర్‌ఒలు గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను పరిశీలించి వాటికి పరిష్కారం చూపాలన్నారు. కదిరి, ధర్మవరం రెవెన్యూ డివిజన్లో రెవెన్యూ సంబంధిత సమస్యలు ఎక్కువ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. డిఆర్‌డిఎ, హెల్త్ విభాగం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలన్నారు. వచ్చిన సమస్యలను తిరస్కరించినప్పుడు ఏ కారణంతో తిరస్కరించారో, ఏ నిబంధన ప్రకారం పరిష్కరించలేక పోతున్నామో స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలన్నారు. మీడియాలో వచ్చిన ప్రతికూల వార్తలపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు ఆయా శాఖలో పనిచేసే వారికి తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం

పాత రోడ్డును కొనసాగించాలి

ప్రజాశక్తి - పెనుకొండ

ప్రజల సౌకర్యార్థం పాత రోడ్డును కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని మడకశిర రహదారిలో కోనాపురం , మంగాపురం , కొండాపురం తదితర గ్రామాలతో పాటు డిగ్రీ కాలేజీకి వెళ్లే ప్రజల, విద్యార్థుల సౌకర్యార్థం పాత రోడ్డ నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాతరోడ్డును కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఇప్పటికే ప్రత్యక్ష పోరాటం చేస్తోందన్నారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు 50 ఏళ్ళుగా వినియోగిస్తున్న పాతరోడ్డు దురాక్రమణకు గురవుతోందని అన్నారు. పెనుకొండ గ్రామపటంలో ఈ రోడ్డు బండి రస్తాగా ప్రభుత్వం గుర్తించిందని, గ్రామ పంచాయితీ, ఆర్ అండ్ బి అధికారులు లక్షలాది రూపాయలు ప్రభుత్వ నిధులు వెచ్చించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. పట్టా భూమి, హైకోర్టు ఉత్తర్వులు పేరుతో వాస్తవాలను కప్పిపుచ్చి ఒకటి , రెండు కుటుంబాల ప్రయోజనాల కోసం మూడు గ్రామాల ప్రజలతో పాటు విద్యార్థులకు ఉపయోగకరమైన రోడ్డును రద్దు చేయాలనుకోవాలనుకునే ఆలోచనలు అధికారులు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆయన అన్నారు. ఈ విషయంలో ప్రజల పక్షాన జిల్లా వ్యాప్త పోరాటం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పాత రోడ్డ నే కొనసాగించాలని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం పాత రోడ్డును బంద్ చేస్తూ ముళ్ల కంచె వేయడానికి అధికార తెలుగుదేశం పార్టీ రామలింగప్ప (రియల్ ఎస్టేట్), కొంతమంది అనుచరులు కలిసి సిమెంట్ దిమ్మెలు నాటడానికి పునుకున్నారని విషయం తెలుసుకుని పనులను అడ్డుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, సిపిఎం నాయకులు వెంకట్రాముడు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో మంగళవారం ప్రాజెక్టు స్థాయి అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం బాలల హక్కుల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ జి.శాంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ హాజరయ్యారు. బాల్య వివాహ చట్టం, బాలల న్యాయ చట్టం, పోక్సో యాకు, బాలల హక్కులు, పిల్లలపై లైంగిక వేధింపుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం సిడిపిఒ మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలే విశిష్టతను గురించి వివరించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎం.సుజాతమ్మ, అనురాధ, పుష్ప, ఎర్రమ్మ, ప్రాజెక్టు స్థాయి అంగన్వాడీ కార్యకర్తలు బావమ్మ, జయమ్మ, మాబున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపును ఆపండి

పరిగి : మండల వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న మట్టి తరలింపు చర్యలను అడ్డుకోవాలని టిడిపి మండల నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహ, ఎస్ఐ సత్యనారాయణకు అందజేశారు. ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండా గత ప్రభుత్వం విచ్చలవిడిగా మట్టిని తరలించిందని అలాంటి సంస్కృతికి అడ్డుకట్ట వేయాలని టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జడ్పిటిసి సూర్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చౌడప్ప, టిడిపి మండల నాయకులు మారుతి ప్రసాద్ లక్ష్మణరావు, నరసింహప్ప, డిఎస్ఎల్ శ్రీనివాసులు, కంకర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆర్‌జెడికి వినతి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన కడప ప్రాంతీయ సంచాలకులు(ఆర్జేడీ)కి విన్నవించారు. మంగళవారం అనంతపురంలోని ఆర్డీటీ ఆడిటోరియంలో ఆర్జేడీని యూటీఎఫ్ నాయకులు కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ యూటిఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఆరోజేడీని కలిసి ఉపాధ్యాయుల సమస్యలను విన్నవించామన్నారు. ప్రధానంగా జీవో 117ను రద్దుచేయాలని, ఫ్రీ ప్రైమరీతోపాటు 1 నుండి 5 తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలుచేయాలని,హైస్కూల్లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగిం చాలని ఆర్జేడీకి విన్నవించామన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని, పనిభారం తగ్గించాలని, వేసవి సెలవులలో నాడు-నేడు, ప్లస్ టు తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ రామకృష్ణనాయక్, నాయకులు అనిల్‌కుమార్, లక్ష్మయ్య, వెంకటకిశోర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్‌జెడికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : ఎమ్మెల్యే

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని రోడ్డు, రహదారుల విశ్రాంతి భవనంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్ అధికారులు, ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ పట్టణంలో ఉన్న బాలికల వసతిగృహంలో సరైన వసతులు లేనందున బాలికలు ఇబ్బంది పడుతున్నారని, అధికారులతో మాట్లాడి వెంటనే వారిని మరో భవనంలోకి మార్చాలని ఆదేశించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుండి మడకశిరకు రోడ్డుకు సమాంతరంగా బైపాస్ కెనాల్ ఏర్పాటు చేయడం, అమరాపురం, ఆగళి, వరకు అన్ని చెరువులకు నీళ్ల నింపడం కోసం హంద్రీనీవా కాలువను వెడల్పు చేయడం గురించి అధికారులతో చర్చించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులకు, పరిశ్రమలకు ఉన్న విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అందుకు నూతనంగా ఏర్పాటు చేసే సబ్ స్టేషన్ల గురించి, విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు గురించి చర్చించారు.

9,10న కొత్తచెరువులో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 9 10వ తేదీలలో కొత్త చెరువు మండలంలో నిర్వహించనున్న భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి కోరారు. ప్లీనరీ సమావేశాలకు సంబందించిన కరపత్రాలను మంగళవారం పట్టణంలో స్థానిక కళాశాల బీసీ హాస్టల్ లో విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 117, 77 లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మూసివేసిన సంక్షేమ హాస్టల్స్ వెంటనే తిరిగి ప్రారంభించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ హాస్టల్స్ లో పెండింగ్ మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని, హాస్టల్స్ లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పై రాబోవు రోజుల్లో పోరాటాలు చేసేందుకు జిల్లా ప్లీనరీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, జస్వంత్, పవన్, సుభాష్, రంగా, ఫక్రుద్దీన్, గురు, జై చంద్ర, మహేష్, హుస్సేన్, ప్రదీప్, నిహాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

పుట్టపర్తి రూరల్ : ఈనెల 9, 10 తేదీలలో సత్యసాయి జిల్లా కొత్త చెరువు మండలంలో నిర్వహించనున్న ఆరవ ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి కోరారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ,కొత్తచెరువు, బుక్కపట్నం ,తదితర పట్టణంల్లో స్థానిక కళాశాల విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించే ఈ సమావేశాలకు రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారని చెప్పారు.

ప్రమాదకర ప్రయాణం

ప్రజాశక్తి - రొద్దం

రోడ్డుపై ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నా అమాయక ప్రజలను ఆందోళనకర పరిస్థితుల మధ్య వారిని తరలించడంలో వాహనదారులు ఏమాత్రం వెనకాడడం లేదు. ఇందులో భాగంగా మంగళవారం బళ్లారి వైపు నుంచి పత్తి కోసం వచ్చిన బొలెరో వాహనం పదిమంది వ్యక్తులతో టాప్ పై ప్రయాణం చేపట్టారు. వచ్చేటప్పుడు ఖాళీగా వచ్చిన ఆ బొలెరో మండల కేంద్రంలో ఆయా గ్రామాలలో పత్తినించుకుంది. కూలీలను మరొక వాహనంలో తరలించకుండా పత్తి సరుకుతో నిండుగా ఉన్న వాహనం ముందు టాప్ పై దాదాపు పది మంది కూలీలను ఇరుకుగా కూర్చోబెట్టుకొని తరలించారు. అయితే బొలెరో వాహనం వేగంగా వెళ్లినప్పుడు, మలుపుల వద్ద కూలీలు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. పోలీసులు ఇలాంటి వాటిపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బొలెరో టాపుపై ప్రయాణిస్తున్న కూలీలు

పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - నల్లచెరువు

ఆర్డీటీ ఆధ్వర్యంలో నల్లచెరువు ఏరియాలోని బాలికల అథ్లెటిక్ క్రీడా పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనపర్చిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ షఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, శ్రీధర్ రెడ్డి, సుభాన్, పీడీలు చిన్న రెడ్డప్ప, రాధా, సుజాత, హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని పోతుల కుంట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుట్టపర్తికి చెందిన కితమత్ ఏ కల్కు ట్రస్ట్ వ్యవస్థాపకుడు షామీర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు సత్య సాయి బాబా భక్తుడు లక్ష్మీనారాయణ తన కుమార్తె రమ్య జ్ఞాపకార్థముతో ఆయన అందించిన ఆర్థిక సహాయంతో ఈ పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు పలకలు, రైటింగ్ ప్యాడ్స్, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు రవి, సుజాత, మైనార్టీ నాయకులు షెక్షావల్లి, షాకీర్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

ప్రజాశక్తి - పరిగి

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నవీన మాట్లాడుతూ గర్భిణులు, కిషోరబాలికలు రక్తహీనత లేకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ గోవర్ధన రెడ్డి, వైద్యులు స్వరూపరెడ్డి, డాక్టర్ రూబీ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలన్న డిమాండ్‌తో విశాఖపట్నం లో సెప్టెంబరు 1,2,3 తేదీలలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనానికి సంబందించిన పోస్టర్లను ఆసంఘం నాయకులు మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా ఉప కార్యదర్శి మధు నాయక్,జిల్లా, కోశాధికారి బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

జిల్లా విభజన వల్ల నష్టపోయిన శ్రీ సత్య సాయి జిల్లాకు తగిన న్యాయం చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు కోరాయి. ఈ మేరకు పిడిఎస్‌యు, ఎఐఎస్‌పి, ఆర్ఎస్‌వైఎఫ్, పిఎస్ఎఫ్ఐ, పిఎస్‌యు, పిడిఎస్‌యు నాయకులు ఆర్డీవో వెంకట శివరామిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి నిరంజన్ యాదవ్, నవీన్, ఆది, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి - రొద్దం

మండల కేంద్రంలో మంగళవారం సిద్దన్న రేషన్ షాప్ ప్రారంభించారు. టిడిపి మండల నాయకులు మాధవనాయుడు, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, మాజీ సర్పంచ్ అశ్వత్ నారాయణ, మాజీ ఎంపీటీసీలు చిన్నకేశవులు, చంద్రశేఖర్ డీలార్లు అదిశేషు, ఉమశంకర్, సిద్దన్న, బలిజ నాగేంద్ర, బెల్దర్ కిష్టప్ప, పెద్ద చిక్కల్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు చేనేత దినోత్సవం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో నిర్వహించే కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ హాజరవుతున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు, బుధవారం ఉదయం 10గంటలకు కదిరిగేటు వద్ద ఉన్న చేనేత విగ్రహానికి పరిటాలశ్రీరామ్ పూలమాల వేయనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అనుబంధసంస్థల నాయకులు పాల్గొనాలని కోరారు.

గురుకుల బాలికల పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - అమరాపురం

మండల పరిధిలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మంగళవారం తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులకు వండిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన మెను ప్రకారమే భోజనాన్ని అందజేయాలని ప్రిన్సిపల్ పద్మావతిని ఆదేశించారు.ఈ కార్యక్రమంటో టిడిపి మండల కన్వీనర్ గణేష్ ,మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, ప్రసాద్, దాదు, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

'కర్నాటకలో చోరీ జరిగితే మాకేం సంబంధం'..!

వన్ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద జ్యువెలరీ వ్యాపారులు

పోలీసులను నిలదీసిన జ్యువెల్లరీ షాపు అసోషియేషన్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఎవరో ఎక్కడో దొంగతనం చేస్తే జ్యూవలెరీ షాపుల యాజమాన్యాలపై ఆపాదిస్తూ ఇబ్బందులను గురిచేయడం సరికాదంటూ ధర్మవరం జ్యూవలెర్ అసోషియేషన్ నాయకులు అన్నారు.కొందరు దుండగులు కర్నాటకలో దొంగతనం చేసి ధర్మవరంలో అమ్మారన్నారు. దీంతో అనంతపురం పోలీసులు దొంగలిచ్చిన సమాచారం మేరకు 20 రోజులక్రితం రికవరీ చేసినప్పటికి మళ్లీ కర్నాటక పోలీసులు వచ్చి తిరిగి బంగారం ఇవ్వాలంటూ షాపు యజమాని షాహీరు తీసుకెళ్లడంతో అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు కర్నాటక పోలీసులను అడ్డుకున్నారు. దీంతో అటు కర్నాటక పోలీసులు ఇటు జ్యూవలెరీషాపుల యజమానులు ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషను చేరుకోవడంతో కాసేపు తీవ్ర ఉద్రిక్తతత నెలకొంది. ఈ సందర్భంగా అసోషియేషన్ అధ్యక్షులు ఖలీల్ మాట్లాడుతూ పట్టణంలోని షాహిర్అనే స్వర్ణకారుల వ్యాపారుడి స్థానిక పోలీసుల సహకారంతో చిత్రదుర్గ పోలీసులు తీసుకెళ్లడం సరైన పద్ధతికాదన్నారు. కొనుగోలు చేసిన బంగారాన్ని గత నెలలోనే అనంతపురం పోలీసులు రికవరీ చేశారన్నారు. తిరిగి చిత్రదుర్గ పోలీసులు వచ్చి అదే బంగారాన్ని ఇవ్వాలని వ్యాపారిని ఇబ్బందులు పెట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. పట్టణ పోలీసు వ్యవస్థ బంగారు షాపులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. రికవరీ చేసింది పోలీసులే నని వాటిని ఎవరికి అందాలో పోలీసులే తేల్చుకోవాల్సి ఉందని అన్నారు. వారి తప్పులను కప్పి పుచ్చుకోవడానికి బంగారుషాపు దుకాణాలపై అబాండాలు మోపడం పద్ధతి కాదన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై ఎస్పీని కలుస్తామని చెప్పారు. షాహీర్‌ను వదలేవరకు సంఘం తరపున చట్టపరంగా పోరాడుతామన్నారు.

క్రీడా వికాస కేంద్రాన్ని పూర్తిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర రూరల్

2014లో అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మడకశిరలో ఉన్న జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభించిన మడకశిర క్రీడా వికాస కేంద్రం పనులను త్వరితిగతిన పూర్తి చేయలని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశించారు. ఈ మేరకు వారు మంగళవారం మడకశిర క్రీడా వికాస కేంద్రాన్ని పరిశీలించారు. వెంటనే మిగిలిన పనులను పూర్తి చేసి ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పర్యావరణ సమతుల్యానికి చెట్లే మూలం

ప్రజాశక్తి-పెనుకొండ

పర్యావరణ సమతుల్యానికి చెట్లే ప్రధాన కారణమని డివైఇఒ రంగస్వామి అన్నారు. మంగళవారం జనవిజ్ఞానవేదిక (పర్యావరణ సబ్ కమిటీ) ఆధ్వర్యంలో పట్టణంలోని స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా హాజరైన డివైఇఒ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటానికి చెట్లు ప్రధాన భూమికను పోషిస్తాయన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావడం అభినందంచదగ్గ విషయమన్నారు. ప్రజలందరూ ఇలాంటి కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి హరి, ప్రధానోపాధ్యాయులు రఘునాథరావు, ఉపాధ్యాయులు వలివుల్లా, మహీధర్, కార్యకర్తలు నరసింహ, బాబా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న అధికారులు, నాయకులు

ప్రత్యామ్నాయ పంటలసాగుపై అవగాహన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని నల్లగొండరాయన పల్లి, చాకర్లపల్లి గ్రామాలలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఎడిఒ స్వయం ప్రభ, మండల వ్యవసాయ అధికారి కవితా రాణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తన పొలంలో ఏదో ఒక ప్రత్యామ్నాయ పంటను సాగు చేసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రత్యామ్నాయ పంటలు ఉలవలు, అలసందలు, కందలు, జొన్నలు, కూడా రైతులకు లాభాన్ని చేకూరుస్తాయని చెప్పారు. సీజనల్ పంటలతో పాటు ప్రత్యామ్నయ పంటలకు కూడా రైతుల ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా ఈ క్రాఫ్ట్ నమోదు చేసుకోవడానికి, రుణమాఫీ, అన్నదాత సుఖీభవ, కిసాన్ బ్యాంక్ లోన్లు, తదితర ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలంటే తప్పనిసరిగా ప్రతి రైతు పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు హరికృష్ణ, సంజీవ రాయుడు, శ్రీనివాసులు, వెంకటేష్, వార్డు మెంబర్ రాము, సచివాలయ వ్యవసాయ సిబ్బంది సబీహా, బాబావలి, ప్రియాంక, తదితర రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులకు అందని యూరియా

ప్రజాశక్తి- రొద్దం

మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుంచి సరఫరా చేస్తున్న యూరియా నాలుగురోజులుగా అందుబాటులో లేకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతులు ప్రయివేటు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. సొసైటీలో 50 కేజీల బరువు గల యూరియా పాకెట్ 290 రూపాయలు కాగా, ప్రైవేట్ దుకాణపుదారులు 330 రూపాయల వరకు తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

రొద్దం సొసైటీ కార్యాలయం

అన్నక్యాంటీన్లను పరిశీలించిన జేసీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని అన్న క్యాంటీన్లను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. స్థానిక ఎల్పీ సర్కిల్, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను పరిశీలించారు. అన్నక్యాంటీన్లను దగ్గరుండి ఏర్పాట్లు చేయించిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న జేసీ, తదితరులు

రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కరువు

బాధితులతో మాట్లాడుతున్న మాజీమంత్రి శంకరనారాయణ

మాజీ మంత్రి శంకరనారాయణ

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కరువైందని మాజీ మంత్రి శంకరనారాయణ విమర్శించారు. పెనుగొండ నియోజకవర్గం గోరంట్లలో తెలుగుదేశం పార్టీ నాయకుల దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్తలు ఓబులమ్మ, రామకృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని మాజీ మంత్రి శంకర్ నారాయణ మంగళవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. ఐదు సంవత్సరాల లోపు టిడిపి నాయకులు తమ కుటుంబంలోని అందరినీ చంపేస్తామని ఓబుళమ్మను బెదిరించారని ఈ విషయంపై పోలీసులు పట్టించుకోవట్లేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. అధికారం ఉందని టిడిపి నాయకులు, టిడిపి మూకలు పేట్రేగిపోతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని విమర్శించారు. శాంతిభద్రతలకు, ప్రజా జీవితానికి విఘాతం కలిగిస్తున్న అల్లరిమూకలపై పోలీసు వ్యవస్థ వెంటనే చర్యలు తీసుకుని శాంతిభద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -మడకశిర

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని డిఎంహెచ్ఒ మంజువాణి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఎంహెచ్ఒ మాట్లాడుతూ తల్లి పాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధుర్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్‌కుమార్, సిహెచ్ఒ హుస్సేన్ బీ, సూపర్‌వైజర్లు రామ్ ప్రసాద్, సరస్వతి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, అంగనవాడీలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సిడిపిఒ రెడ్డి రమణమ్మ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మోడల్ కాలనీలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో సిడిపిఒ తో పాటు కౌన్సిలర్లు అంజలీ దేవి, మహబూబ్ బీ మాట్లాడుతూ, తల్లి పాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు అనిత, శాంతి, జయమ్మ, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హబీబ్ తస్లీమ్, ఎఎన్ఎం త్రివేణి, ఎర్రమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బుక్కపట్నం : తల్లిపాలు పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కౌసల్య సాయి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్‌లో సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు నాగమణి, అరుణమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని మలసముద్రం, పాలసముద్రం గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగరాణి రజిత మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సువర్ణ అశ్వర్థరెడ్డి, ఎంపీపీ ప్రమీల మూర్తి, బెల్లాల చెరువు చంద్ర మనోహర్, రంగయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మండలం పరిధిలోని నాగనపల్లిలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు చంద్రకళ, మీనాక్షమ్మ, జయమంగళమ్మ, హెల్పర్ నాగలక్ష్మితో పాటు గర్భిణులు, మహిళ లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విశ్రాంత డీఎస్పీ ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని దశరథ రామయ్య కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత డీఎస్పీ గిరిధర్ ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. నాలుగు రోజుల క్రితం గిరిధర్ తన సొంత పని నిమిత్తం వేరే ఇతర ప్రాంతానికి వెళ్లి మంగళవారం ఉదయం ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉండడం చూసి ఇంట్లో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో క్లూస్ టీం విచారణ చేపట్టారు. అయితే ఈ చోరీలో ఎంత నగదు, బంగారం, వెండి చోరీ జరిగిందన్న వివరాలు విచారణ అనంతరం తెలుస్తాయని డీఎస్పీ తెలిపారు. కాగా హిందూపురం ప్రాంతంలో చోరీల పట్ల స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. హిందూపురంలో ద్విచక్ర వాహనాలకు తాళం వేసినా, ఇంటికి తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లినా దొంగతనాలు సర్వసాధారణంగా మారినట్లు పెదవి విరుస్తున్నారు. చివరకు పోలీసుల ఇళ్లలోనే దొంగతనాలు చేసి దొంగలు సవాళ్లు విసురుతున్నా పోలీసులు మాత్రం ఏమాత్రం స్పందించడం లేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దొంగతనాలు జరుగుతుండగా మరోవైపు కొందరు పోలీసులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ ఇసుక, మట్టి, మద్యం అక్రమ రవాణా దారులతో కుమ్మక్కై, పేకాట జూదం నిర్వహిస్తున్న వారితో వాటాలు తీసుకుంటూ, రాజకీయ నాయకుల సేవలో తరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బంగారు గొలుసు అపహరణ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని కాలేజీ సర్కిల్లో నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగ అపహరించుకుని వెళ్లిన విషయం ఆలస్యంగా తెలిసింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన పాపమ్మ అనే మహిళ స్టోర్ బియ్యం తెచ్చుకునేందుకు ఆదివారం ఉదయం 7గంటల సమయంలో వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని దొంగ వచ్చి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును అపహరించుకుని పరారయ్యాడు. దీంతో సోమవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు (35)అని వ్యక్తి సోమవారం రాత్రి విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు.కొండూరు గ్రామ శివారులో బడిసెప్ప తోపులో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య సుభాషిని, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

గుండెపోటుతో చేనేత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు దాసరి వేణుగోపాల్(44) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. వేణుగోపాల్ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. అయితే సోమవారం రాత్రి 7గంటల సమయంలో మగ్గం నేస్తు ఉండగా ఉన్నఫలంగా ఇంటిలో కుప్పకూలిపడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు వేణుగోపాల్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు వేణుగోపాల్ అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతుడికి భార్య దాసరి దుర్గ ఉంది.విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ మతదేహాన్ని సందర్శించిపూలమాల వేసి నివాళులర్పించారు.

సేవా సంస్థకు విరాళం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ఎల్సికే పూర్వక సంబంధించిన శ్రీ వాసవాంబా స్వచ్ఛంద సేవా సంస్థకు పట్టణములోని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ బివి సుబ్బారావు తనవంతుగా 5వేల రూపాయలను విరాళంగా అందజేశారని వాసవాంబా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సత్రశాల నారాయణశెట్టి, ఉపాధ్యక్షులు జయంతి అమర్నాథ్, కోశాధికారి మేడ జయవర్ధన్ తెలిపారు. ఈసందర్భంగా వారు సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

యానిమేటర్లు బాధ్యతతో పనిచేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరక్టర్ సరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని సరస్వతీ మండల సమైక్యలో యానిమేటర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన పీడీ మాట్లాడుతూ గ్రామాలలో యానిమేటర్లు బాధ్యతగా పనిచేస్తూ అవినీతికి తావు లేకుండా ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. మంచి పనితీరుతోనే ప్రాజెక్టుకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ డిపిఎం రామిరెడ్డి, ఏపీఎం రామాంజనేయులు, ట్రైనర్ మదర్‌సాబ్, ఎల్సి రామచంద్రప్ప, మండలంలోని సీసీలు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న పీడీ

హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ప్రభుత్వ వసతిగృహాలలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నల్లజోడు పవన్, చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గణేష్ సర్కిల్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు హాస్టల్ విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నల్లజోడు పవన్, చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జులై 20 నుండి 30 తారీకు వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టల్ సందర్శన చేయడం జరిగిందన్నారు. 100 కు పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ హాస్టల్స్ ఉండగా ఇందులో పదుల సంఖ్యలో శిధిలావస్థకు చేరాయన్నారు. కొన్ని హాస్టల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. సొంత భవనాలు లేక చాలి చాలని అద్దె భవనాల్లో ఉంటూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెండింగ్లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. విద్యా సంవత్సరం మొదలై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు, విద్యార్థులకు అందలేదన్నారు. బాలికల వసతిగృహాల్లో సానిటరీ ప్యాడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ విషయం పైన గతంలో కూడా పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ ఫలితం శూన్యంఅని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ అరుణ్ కుమార్ రెడ్డి, శేషం మహేంద్ర, నరసింహమూర్తి, నాయకులు దేవరాజ్, పవన్, గణేష్, గౌతమ్, సాయి, ప్రేమ్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న నాయకులు

అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లి ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్సీపీ నేత కోటి నరేష్‌కుమార్ అనంతపురం మండలం కాటిగానికాలువ గ్రామంలోని ఆశ్రయ ఆనాథాశ్రమములో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటి నరేష్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనతో పాటు కుటుంబసభ్యులు కోటి రాముడు, కోటి గురుమూర్తి ఘాట్ల వద్ద నివాళులర్పించారు. అనంతరం శ్రేయోభిలాషులు, అభిమానులు. కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం